**Andhra Jyothi**

# జడ్జిల నియామకాల్లో ప్రతిష్టంభన లేదు: ఏజీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: ఉన్నత కోర్టులలో జడ్జిల నియామకాలు, బదిలీలలో ఎలాంటి ప్రతిష్టంభన లేదని, పరస్పరం వేలెత్తి చూపుకొనే అవకాశం లేదని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. సీజే టీఎస్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రభుత్వం తరఫున బుధవారం హాజరైన అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ జడ్జిల తాజా నియామకాలు, బదిలీలకు సంబంధించి వాస్తవాలు, గణాంకాలతో రెండు సెట్ల డాక్యుమెంట్లను సీల్డు కవర్‌లో సమర్పించారు. హైకోర్టు సీజేలు, జడ్జిల నియామకాలు, బదిలీలకు సంబంధించి కొలీజియం సిఫారసులను ప్రభుత్వం అమలుపరచడం లేదంటూ సుప్రీంకోర్టు గత నెలలో కేంద్రాన్ని ఘాటుగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన నెల తర్వాత ఈ కేసు తిరిగి సీజే ధర్మాసనం ముందుకు పునర్విచారణకు వచ్చింది. అయితే జడ్జిల నియామకాల ప్రక్రియను హైకోర్టులే చాలా ఆలస్యంగా ప్రారంభించాయని అటార్నీ జనరల్ అన్నారు. "ఎవరూ ఎవర్నీ నిందించడానికి ఏమీ లేదు. వ్యవస్థలో ఎలాంటి ప్రతిష్టంభన నెలకొనలేదు. ఇదొక రేసులాంటిది. త్వరగా పరుగు ప్రారంభిస్తే, త్వరగా లక్ష్యాన్ని చేరుకుంటాం" అని రోహత్గీ చెప్పారు. ఐదు, ఆరేళ్ల క్రితంనాటి జడ్జి పోస్టుల భర్తీ ప్రక్రియను హైకోర్టులు చాలా ఆలస్యంగా ప్రారంభించాయని ఆయన అన్నారు. తాము సమర్పించిన డాక్యుమెంట్లలో వివిధ హైకోర్టులలోని ప్రతి అంశాన్నీ ప్రస్తావించామని, అలహాబాద్ హైకోర్టులో పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండగా, కొన్ని కోర్టులలో గత 9 ఏళ్లుగా ఖాళీల భర్తీ జరగలేదని కూడా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, కేరళ, అలహాబాద్ హైకోర్టులకు కొలీజియం చేసిన సిఫారసులు ఆమోదం పొందాయని ఏజీ తెలిపారు. కేంద్ర చర్యలను ధర్మాసనం ప్రశంసిస్తూ, ఇదెంతో కఠినతరమైన ప్రక్రియ అని వ్యాఖ్యానించింది. "ఈ సిఫారసులు మా వద్దకు వచ్చి, మేము పరిశీలన చేపట్టిన తర్వాత ఇక జాప్యం జరగడానికి వీల్లేదు. వాటిని ఆమోదించాలే తప్ప, నిలుపుదల చేయకూడదు." అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుపై తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.